# సావిత్రి




"మిమ్మల్ని పిలుస్తున్నారండీ!"

ఎవరిదో అపరిచిత కంఠస్వరం. ఆ కంఠంలో ఓ విధమైన విచిత్ర మాధుర్యముంది. కాగితాల్లోనుండి తలఎత్తి చూశాను కుతూహలంగా.

నా కెదురుగా ఓ యువతి నిలుచునిఉంది. నల్లని రంగు, కోలముఖం, విషాదాన్ని నింపుకున్న లోతుకు పోయిన కళ్ళు, సింగారింపు కోల్పోయిన పాలిపోయిన బుగ్గలు — ఆమెను చూచిన వెంటనే అందగత్తె కాదని తెలుస్తాయి. ఏదో చౌకరకం పౌడరు వాసన నా నాసిక పుటాలను తాకింది. చౌకరకం టెరిలిన్ చీర కట్టుకుంది. దానికి తగిన పొట్టిచేతుల జాకెట్టు వేసుకుంది. ఆర్టిఫిషియల్ ముత్యాలదండ ఒకటి పైట మీద సవిలాసంగా ఊగులాడుతోంది. హైహీల్డ్ షూస్ వేసుకుంది. చేతులు బోసిగా ఉన్నాయి. నుదుటిమీద పెడవాటి నామం దిద్దుకుంది. రెండు జడలు వేసుకుని, ఒక జడ ముందుకు వేసుకుంది. ఆమె అలంకరించుకున్నట్లు అనిపించలేదు నాకు. ఆ అలంకరణ శరీరానికి కలిసిరాలేదు. ఏదో వేషం వేసుకున్నట్లుంది.

"ఎవరు పిలుస్తున్నారు?" ఆమె ముఖంలోకి పరిశీలనగా చూస్తూ అడిగాను. ఆ ముందురోజే ఉద్యోగంలో చేరాను గనక, ఎవరు పిలుస్తున్నారో అర్థం కాలేదు.

వెంటనే ఆమె ముఖంలోని భావాలు మారిపోయాయి. చిరచిరలాడుతూ అంది: "ఎవరో పిలిస్తే వచ్చి నే నెందుకు పిలుస్తాను?"

అకస్మాత్తుగా కలిగిన ఆ మార్పుకు ఆశ్చర్యపోతూ చుట్టూ కలయచూశాను.

మా సెక్షన్‌లో ఉన్న నలుగురు గుమాస్తాలు మెల్లిగా, తలలెత్తకుండానే నవ్వుకుంటున్నారు. నా ఆశ్చర్యానికి అవధులే లేకపోయాయి. కొన్ని క్షణాలు మౌనంగా జరిగిపోయాయి.

"హెడ్ గుమాస్తాగారు పిలుస్తున్నారండీ!" అంది అలవోకగా నవ్వుతూ.

ఈసారి నా ఆశ్చర్యానికి అవధులే లేకపోయాయి.

అంతలోనే ఆగ్రహం! అంతలోనే అనుగ్రహం! ఏమిటీ ఊసరవెల్లి రూపం?

నేను మౌనంగా లేచి ఆమె ననుసరించాను.

ఆయన నా సీటునుండి అర్జెంటుగా వెళ్ళవలసిన పేపర్ల సంగతి చెప్పారు. తిరిగి వచ్చి కుర్చీలో కూర్చుని ఆ పేపర్ల విషయం చూడసాగాను. వ్రాస్తున్నా మనసులోమాటుకు ఆ విచిత్రవ్యక్తే మెదులుతూంది. ఆవిడను గురించి తెలుసుకోవాలన్న కుతూహలం క్షణ క్షణానికి మరి పెరిగిపోసాగింది. మధ్యలో ఓసారి తలెత్తి మంగపతివేపు ప్రశ్నార్థకంగా చూశాను 'ఎవరీవిడ?' అన్నట్లు. నా ప్రశ్న నర్థంచేసుకున్నా, 'కళ్ళతో వేసే ప్రశ్నలకు ఎవరు జవాబులు చెబుతారోయ్!' అన్నట్లు ముసిముసిగా నవ్వుతూ చూపులు వాల్చుకున్నాడు. నాకు బాగానే కోపం వచ్చింది మంగపతిమీద. అవతలి వ్యక్తి కుతూహలాన్ని కొంచెమన్నా అర్థం చేసుకోరేం ఈ మనుషులు? మనసు కుతకుతలాడి పోతుండగా తిరిగి పేపర్లలో తల దూర్చాను. మరో అరగంటకూడా నెమ్మదిగా జరిగిపోయింది. చిత్ర గువ్వువి రెక్కలా పెరుగుతూంది కౌతుకం. తలెత్తి చూశాను. మంగపతి, పక్కనున్న గుమాస్తాలూ బాతాఖానీ కొడుతున్నారు.

"ఇంతకూ ఎవరీవిడ, మంగపతీ?"

"సావిత్రీదేవి!" ఇంటి పైకప్పు ఎగిరిపోయేటంత గట్టిగా నవ్వి అన్నాడు.

మంగపతి నవ్వుతో శ్రుతి కలిపారు అందరూ.


"పేరు కాదయ్యా బాబూ, నేను అడుగుతూంట."

"ఇంకేమిటి? డెసిగ్నేషనా?" పక్కన నవ్వుతూ అన్నాడు.

"ఊఁ . . ."

"ఆఫీస్ అటెండర్!"

మంగపతి ఆ మాట అంటూండగానే సావిత్రి లోపలకు వచ్చింది. రాగానే గదిలో ఒక మూలగా ఉన్న కుర్చీని నా కెదురుగా లాక్కుని కూర్చుంది దర్జాగా. ఆ చర్యకు నేను లోలోపలే విస్తుపోతూ ఓరగా చూశాను అందరివేపూ. అందరి పెదవులమీద చిరునవ్వు సవిలాసనాట్యం చేస్తూంది. నాకు చాలా చికాకేసింది. అయినా నా చికాకును పైకి వ్యక్తం చేయక మౌనంగా వ్రాసుకోసాగాను. అపాదమస్తకం నన్ను పరిశీలిస్తూ కూర్చుంది సావిత్రి. పరిశీలన






ముగిసింది గాబోలు, "మీ దేవూరండీ, శేఖరంగారూ?" అంది.

చెప్పాను.

"అమ్మా, నాన్నా అంతా ఉన్నారా?"

'ఉన్నా'రన్నట్లు తల ఊపాను.

"వాళ్లకు మీరు నెలనెలా డబ్బు పంపాలా?"

అక్కర్లేదని చెప్పాను.

"అయితే మీరే వాడుకోవచ్చన్న మాట." వెకిలిగా నవ్వుతూ అంది.

దానికి నేను జవాబు చెప్పబోయేలోగా మంగపతి అందుకుని అన్నాడు: "నీకు ఇష్టడులే!"

చరుక్కున కుర్చీ లాగి లేచి నిలుచుంది సావిత్రి. కోపంతో నిలువెల్లా వణికిపోతూంది.

నల్లని ముఖంలోకి రక్తాన్ని చిమ్మింది హృదయం. క్రిందిపెదవి వణుకుతూంది. కళ్లు చెమ్మగిల్లి వస్తున్నాయి.

"గొప్పింటి మర్యాదస్థుల ఆడపిల్లలను గురించి అంత తక్కువగా మాట్లాడరాదని తెలీదూ?" కొర కొరా మంగపతివేపు చూస్తూ వివరిత్వరంతో అంది.

"ఓ! నీ మర్యాదా, గొప్పతనం అక్కడ బజారులో అమ్ముతున్నారట!" అన్నాడు హేళనగా నవ్వుతూ.

"షటప్! అసలు నీకు నా జోలెందుకు? ఎక్కువగా మాట్లాడావంటే మర్యాద దక్కదు, మంగపతీ!" ఆవేశాగ్రహాలతో అంది.

"నా మర్యాదకేంలే! ముందు నీ మర్యాద సంగతి చూసుకో!"

"ఆఫీసరుకు రిపోర్టు చేస్తానుండు!" అంటూ విసవిస లాడుతూ అక్కడినుండి వెళ్లిపోయింది.

"త్వరగా వెళ్లు!" కిసుకా నవ్వుతూ అన్నాడు మంగపతి.

"ఊరుకోవయ్యా! ఆ పిచ్చిదానితో ఎందుకు?" పక్కనున్న రంగనాథం అన్నాడు.

"ఆవిడ పిచ్చిదా!" ఆశ్చర్యమే వేసి అన్నాను.

"పెళ్లిపిచ్చి పట్టుకుంది." కసిగా అన్నాడు మంగపతి.

నేను స్థాణువులా కూర్చుండిపోయాను కాసేపు. నా తలంతా ఆలోచనలతో నిండిపోయింది. ఆలోచనల మధ్యే పంపవలసిన కాగితాలు పూర్తిచేశాను. ఆఫీసు వదిలాక పార్కుదారి పట్టాను.

పార్కులో జనం చాలా పలచగా ఉన్నారు. సూర్యుడు పడమటి కొండల్లోకి చేరుకోబోతున్నాడు. నీరెండ ఇసుకమీద పడి తళతళ మెరుస్తూంది. ఓ క్రోటను చెట్టు దగ్గరగా వెళ్లి కూర్చున్నాను. ఆలోచనలు సావిత్రిచుట్టూ పరిభ్రమిస్తున్నాయి. సావిత్రి పిచ్చిదా?

"హలో! శేఖరం!"

"హలో! రా! ఇలా కూర్చో."

మంగపతి వచ్చి పక్కనే కూర్చున్నాడు. కాసేపు లోకాభిరామాయణం అయ్యాక సావిత్రి సంగతి వచ్చింది.

"నిజంగా ఆవిడకి పిచ్చా, మంగపతీ?" కుతూహలాన్ని అణుచుకోలేక తిరిగి అడిగాను.

మంగపతి సిగరెట్టు వెలిగిస్తూ, "పిచ్చే! ఆ మాటలూ, ఆ చేష్టలూ చూస్తే తెలీదూ?" అన్నాడు.

"ఎందుకు పిచ్చిపట్టిందంటావూ?"

"పిచ్చంటే వీథులవెంట తిరిగి, కేకలువేసే పిచ్చి కాదు . . . ఇదోరకం పిచ్చి . . . పెళ్లిచేసుకోవాలని చాలా రోజులుగా ప్రయత్నిస్తూంది . . . ఇప్పు డిక

**భయంకరమైన నిజాన్ని భరించలేక, కొందరు కేవలం భ్రమలో బ్రతుకుతుంటారు. ఆ తెర తొలగిపోతే, అవతల క్రమ్మిఉన్న కారుమేఘాల గర్జనలు భరించడం కష్టం... కాని ఒకనాటికి తెర తొలగుతుంది... మేఘగర్జన వినిపిస్తుంది.**

---

ఏముట్టూ తిరుగుతుందిలే . . . కాస్త జాగ్రత్తగా ఉండు, బ్రదర్!" అదో రకంగా నవ్వుతూ అన్నాడు.

సావిత్రి రూపం అస్పష్టమైన రేఖలతో కళ్ల ముందు కదిలింది. నా హృదయం శూన్యంగా ఉంది. ఆమెపట్ల జాలిగానీ, సానుభూతిగానీ, కోపంగానీ, అసహ్యంగానీ ఏమీ కలగలేదు అప్పటికి.

"ఏవేవో కథలు చెబుతుంది! ఇంకా నీకు చెప్పడం ప్రారంభించలేదు కాబోలు!" పకపకా నవ్వుతూ అన్నాడు.

"ఈ రోజేగా పరిచయమైంది." మంగపతి కన్నుల్లోని రోతను కొలుస్తూ అన్నాను.

"రేపటినుండి ప్రారంభిస్తుందిలే!" అంటూ లేచాడు.

"పోనీ, ఆ కథలేవో నువ్వే చెప్పరాదూ?" నేనూ లేస్తూ అన్నాను.

"అబ్బే! నేను చెబితే ఏం బాగుంటాయి? ఆవిడ చెప్పాలి. . . వినాలి!"

ఇద్దరం నవ్వాము. తరవాత మంగపతి ఇంటిదారి, నేను గదిదారి పట్టాము.

• • •

పదిరోజులు జరిగిపోయాయి. ఈ పదిరోజుల్లోనూ సావిత్రి నాతో మాట్లాడేందుకు, దగ్గరికి వచ్చేందుకు తీవ్రప్రయత్నమే చేసిందని చెప్పవచ్చు. నే నామెను దూరంగా ఉంచేందుకు అంతగా ప్రయత్నించలేదు. ఆమె మనఃప్రవృత్తి ఒక్కోరోజు ఒక్కోరకంగా ఉండేది. ఒక్కోరోజు ప్రళయ రుద్రరూపిణిని గుర్తుకు తెచ్చేది. ఒక్కోరోజు ప్రసన్న భామిని తలపింపజేసేది. ఒక్కోరోజు ప్రశాంత సంధ్యను మరపింపజేసేది. ఆమె ఆలోచనలకూ, మాటలకూ ఒకదానికొకటి సంబంధం ఉండదు. ఇష్టమైతే మనం వినకున్నాసరే గంటలు గంటలు మాట్లాడుతుంది. ఒక్కోరోజు అసలు పెదవి విప్పదు.

ఆ రోజు తలనొప్పిగా ఉండడంవల్ల ఆఫీసుకు సెలవుపెట్టి నా గదిలోనే ఉండిపోయాను. సాయంత్రానికి తలనొప్పి కాస్త తగ్గింది. కాఫీ త్రాగి, ఈజీ చేర్లో పడుకుని ఏదో పత్రిక తిరగేస్తున్నాను. వాకిట్లో చెప్పుల చప్పుడయింది. తలెత్తి వాకిలివైపు చూశాను. ఓరగా మూసున్న తలుపు నెట్టుకుని సావిత్రి ప్రత్యక్షమైంది. ఎందుకొచ్చిందన్న ప్రశ్నకన్నా, నా గది ఎలా తెలిసిందన్న ప్రశ్న నన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేసింది.

విస్ఫారిత నేత్రాలతో ఆమెవైపు అలాగే చూస్తుండిపోయాను.

"ఏమిటలా గుడ్లప్పగించి చూస్తున్నారు?" కిలకిలా నవ్వుతూ అంది సావిత్రి.

"ఏం లేదు. నా గది ఎలా తెలుసు నీకు?"

ఆమె రాక ఆహ్లాదకరంగానూ లేదు, అయిష్టంగానూ లేదు.

'మీ' అని ఆమెను గౌరవార్థకంగా సంబోధించడం ఏనాడో మానుకున్నాను. నేనేకాదు, ఆఫీసులో ఎవ్వరూ ఆమెను గౌరవించి మన్నించరు.

"అదేం ప్రశ్నండీ? మనమంటే మార్గం లేకపోతుందా?" సుతారంగా నవ్వుతూ ప్రశ్నించింది.

"నిజమే! కూర్చో." నవ్వుతూ అన్నాను.

ఆమె గది నాలుగుమూలలా పరీక్షిస్తూ కూచుంది కుర్చీలో. చదువుతున్న పుస్తకం కళ్లవరకూ అడ్డుపెట్టుకుని నే నామె ముఖంలోకి చూడసాగాను. ఆమెకున్న నాలుగు చౌకరకం టెరిలిన్ చీరల్లో నీలంరంగుది కట్టుకుంది. అదే రంగు బ్లౌజు వేసుకుంది. దట్టంగా అద్దిన పౌడరు నల్లనిరంగును ఏమాత్రం దాచలేకపోయింది. అందంగా ఉండాలని ఆమె చేసే ప్రయత్నం ఒక్కోసారి మరీ హాస్యాస్పదంగా ఉండేది. ఆమె కళ్ల క్రింద ఏర్పడిన నల్లని చారలను ఆ రోజే మొదటిసారిగా చూశాను నేను. ముప్ఫయి ఏళ్లకు పైగా ఉన్నట్లనిపించింది వయస్సు. కానీ ఆ వయస్సును దాచేందుకు ఆమె చేస్తున్న వ్యర్థప్రయత్నం చూశాక జాలి, బాధా కలిగాయి.

"ఈ రోజు సెలవుపెట్టారేం?" నా ముఖంలోకి చూస్తూ అంది, గదిని పరిశీలించడం మాని.

"తలనొప్పిగా ఉంటే . . ."

"ఇప్పు డెలా ఉంది?" ఆందోళన తాలూకు జీరలు కదిలాయి ఆమె కంఠంలో.

నే నామె కళ్లలోకి చూశాను.

స్వచ్ఛమైన స్నేహరేఖలు ఆమె కన్నుల్లో మెరిశాయి.

"బాగుంది. థాంక్స్!"

"భోజనం హోటలునుంచి తెప్పించుకుంటారా?"

"ఊఁ . . ."

"ఇంటిదగ్గరనుండి వచ్చి వండిపెట్టేవాళ్లు ఎవరూ లేరూ?"

"ఉహుఁ . . ." తల అడ్డంగా ఊపుతూ ఆమె ముఖంలోని భావాల రంగులను గమనిస్తూ అన్నాను.

"పోనీ, పెళ్లిచేసుకోకూడదూ?"

నేను అదిరిపడ్డాను. మంగపతి చిరునవ్వుతో కళ్ల ముందు కదిలాడు. ఓరగా ఆమె ముఖంలోకి చూశాను. మంగపతి చెప్పినట్లు, నేను ఊహించినట్లు ఆమె ముఖంలో సిగ్గుల మొగ్గలు విరియలేదు. ఏదో మామూలు విషయం చెప్పినట్లు, అదీ ఒక స్నేహితుడు మరో స్నేహితునితో చెప్పినట్లు చెప్పింది. నాకు వలె చేస్తున్నపక్షంలో, ఆమె ప్రవర్తన ఇలా ఉంటుందా? ఏమో?. . . ఈ ఆడవాళ్ల విషయంలో, అందులో ఇలాంటి వ్యక్తిత్వాలతో కాస్త జాగ్రత్తగా ఉండడం మేలు. పైగా, మంగపతికూడా ఆ విషయంగా హెచ్చరిక చేశాడు. అసలామె వస్త్రధారణా, మాటల తీరూ, ప్రవర్తనా ఆమెపట్ల నాకు ఒక సదభిప్రాయం కలిగేందుకు ఏమాత్రం తోడ్పడలేదు. ఆమె ప్రతి

---

**'వాచస్పతి'**

---

HLP
APBD
BOOKS FOR YOU

పరిపూర్ణరూపంలో సమర్పణకు తలపెట్టిన

'ఇంటింటా స్వంత గ్రంథాలయం' ప్రణాళిక

దేశమంతటా ఇటీవల అలవిమీరి అల్లుకొన్న అశాంతి మూలంగా తప్పనిసరిగా వస్తకాలం మీదనుంచి మనసు తప్పిన పుస్తక ప్రియులకై ఇప్పటివరకే అది గాంతించిన కారణంగా

సౌమ్య తెలుగు ఉగాది దాకా
(మార్చి 19)

గడువు పొడిగింపు

నియమాలూ, నిబంధనలూ, క్రితం అక్రితం వారాల పత్రికా ప్రకటనల్లోనివే

ఉచిత బహుమతి

అందాకా చేరే అందరికీ కూడా అవశ్యం ఉండి తీరుతుంది

ఆంధ్రప్రదేశ్
బుక్ డిస్ట్రిబ్యూటర్స్

రాష్ట్రపతి రోడ్డు :: సికింద్రాబాదు

ఉం దాని. వయసు మరో అయిదు సంవత్సరాలు పెరిగినట్లనిపించింది. సావిత్రిమీద అర్థంలేని ద్వేషం, కోపం నాకు తెలీకుండానే హృదయంలో చోటు చేసుకున్నాయి. ఆమెను తక్కువగా చూడడం, నిర్లక్ష్యంగా మాట్లాడడంకూడా నాకు తెలీకుండా జరుగుతున్న సంగతే.

"పొద్దుటే బయలుదేరావు. ఏమిటి విశేషం?"

"ఏం లేదు . . ." నాన్చింది.

"ఊఁ... నేను నమ్మను . . నిజం చెప్పు."

"డబ్బు కావాలండి!"

"లేదు." కచ్చితంగా అన్నాను.

అంత కటువుగా ఎలా చెప్పగలిగానో అర్థం కాలేదు. అందం లేకున్నా, వయసు కరిగిపోతున్నా ఆమె ఒక స్త్రీ. ఒక స్త్రీపట్ల నా ప్రవర్తన అలాగేనా ఉండవలసింది? మనసు మెత్తబడసాగింది.

"చాలా అవసరమండి, శేఖరంగారూ!" కంఠం వినయంగా ప్రార్థన.

"నీకు అవసరంలేని దెప్పుడు? అలా అబద్ధాలు చెప్పడంకంటే నిజమేమిటో చెప్పరాదూ?" తెచ్చిపెట్టుకున్న కోపంతో అన్నాను.

"నేనంటే ఎందుకు మీ కంత కోపం?" జాలిగా నావైపు చూస్తూ బరువైన కంఠంతో అంది.

అవును. ఎందుకు సావిత్రిమీద నా కంత కోపం? నిజంగా నాకు సావిత్రిమీద కోపం ఉందా?

"నీమీద నాకు కోపం ఎందుకు, సావిత్రీ?" మెత్తగానే అన్నాను.

"లేకుంటే డబ్బెందు కివ్వరు?"

"ఇది మరీ బాగుంది! నువ్వడిగినప్పుడల్లా నా దగ్గర డబ్బుండద్దూ?"

"మాదగ్గర డబ్బు లేదంటే నేను నమ్మను."

"తీసుకువెళ్ళిన డబ్బు తిరిగి ఇవ్వకుంటే ఎవరు నీకు ఎన్నిసార్లిస్తారు?"

"నేను మీదగ్గర డబ్బు తీసుకున్నానా?"

నిర్ఘాంతపోయాను. ఇంకేం మాట్లాడాలో అనుకోలేదు. ఆమెమీద అసహ్యం మరింత పెరిగింది. ఛీ! ఛీ! ఇదేం ఆడదిరా బాబూ! ఈవిడ నా గదికి రావడం కూడా గౌరవప్రదం కాదనిపించింది.

"చూడండి! నాన్నగారు రాగానే బాంకునుండి తీసి ఇస్తాను. చాలా అవసరమండి! పదిరూపాయలున్నా ఇవ్వండి! ప్లీజ్... కాదనకండి!"

నేను మౌనంగా ఉండిపోయాను ఆలోచిస్తూ.

"దయచేసి లేదనకండి... మీ దగ్గర ఉంది... మీరెంతో మంచివారు... అందుకే మీ దగ్గరికి వచ్చాను..." ఆర్తస్వరంతో అంది.

అంత మంచి సర్టిఫికేటును నిరాకరించలేకపోయాను. నాలోని బలహీనత ఆ పని చేయనియలేదు. పది రూపాయలు తీసి ఇచ్చాను.

"నాకు తెలుసు మీ రిస్తారని!" ఆప్తనయనాల నుండి నవ్వును వెదజల్లుతూ వెళ్ళిపోయింది.

సావిత్రి అలా వెళ్ళగానే మంగపతి లోపలికి వచ్చాడు. డబ్బుకోసమే వచ్చాడు. లేదన్నాను. లేదన్నందుకు అంత బాధపడినట్లు కనిపించలేదు. వెళ్ళేటప్పుడు అడిగాడు:

"సావిత్రి వచ్చినట్లుందే?"

"ఊఁ! . . ." ఏదో తప్పు చేసినట్లు చూపులు వాల్చి అన్నాను.

"జాగ్రత్త, బ్రదర్! మళ్ళీ చెబుతున్నాను. అవసరానికి వాడుకోగానీ, ఎలాంటి బంధాలూ తగిలించుకోకు. ఒట్టి బజారుసరుకు!"

"బజారుసరుకా!"

"ఆహా! అందులో సందేహమేముంది?"

కానీ, ఎందుకనో ఆ మాట విన్నప్పటినుండి సూదులతో పొడిచినట్లు గుండెల్లో బాధ. బాధాకరమైన విషయమైనా నమ్మక తప్పలేదు. కాదంటే కాదని రుజువుచేసేందుకు మంగపతికి ఆధారా లెన్నో ఉన్నాయి. సావిత్రి వెకిలినవ్వులూ, అర్థంలేని ప్రేలాపనలూ, బాచిలర్స్ రూములకి వెళ్ళడం, డబ్బడగడం (నా గదికి వచ్చి నన్ను డబ్బడిగిన మనిషి ఇతరుల గదులకి వెళ్ళదనీ, వాళ్ళను డబ్బడగదనీ నమ్మడమెలా?), ఆ చౌకరకం అలంకరణ, అబద్ధాలు చెప్పడం, డబ్బు తీసుకుని ఎగ వేయడం — ఇవన్నీ చాలు ఆమె ఒట్టి బజారురకమని రుజువుచేసేందుకు. అయిష్టంగానే ఆ రోజంతా సావిత్రినిగురించే ఆలోచిస్తూ ఉండిపోయాను.

• • •

రెండోసారి సావిత్రి డబ్బు తీసుకువెళ్ళి రెండు వారాలు జరిగిపోయాయి. రోజుకు పదిసార్లన్నా ఆమెతో మా గదికి వచ్చేది. నన్ను మాటల్లోకి దింపి అది ప్రయత్నించేది. ఆమె దగ్గరికి వచ్చేకొద్దీ ఆమెకు దూరం కావాలన్న భావం నాలో ప్రవృద్ధి కాసాగింది. ఆమె అంటే చులకనభావం పర్వతంలా పెరిగిపోయింది. ఒక్కోసారి ఆమె పదేపదే మాట్లాడినా పలికేవాణ్ణికాదు. నల్లని, అందవిహీనమైన ఆమె ముఖం చూస్తుంటే నా ఒంటిమీద తేళ్ళూ జెర్రులూ ప్రాకినట్లయ్యేది.

> **వాచాలత్వం**
>
> 'మూసుకున్న నోట్లోకి ఈగైనా చొరబడదు' అనే ఫిలిఫీన్ సామెత పట్ల నాకు గౌరవం ఎక్కువ.
>
> —థియోడర్ రూజ్వెల్టు జూనియర్

రాత్రి ఎనిమిది గంటలు కావస్తోంది. నేను హోటల్లో భోజనంచేసి, కిళ్ళీ వేసుకుని, సిగరెట్టు కాలుస్తూ నడుస్తున్నాను. గది దగ్గరగా వచ్చి తలెత్తి చూస్తే మెట్లదగ్గర ఎవరో నిలుచున్నట్లనిపించింది.

"ఎవరక్కడ?"

జవాబు లేదు. తిరిగి అదే ప్రశ్న వేశాను.

"నేనండి!"

కంఠస్వరాన్నిబట్టి సావిత్రి అని గ్రహించాను. అంత పొద్దుపోయాక సావిత్రికి నాతో ఏం పని వచ్చిందబ్బా? అయినా ఈ బజారుమనిషి ఈ సమయంలో నా గదికి రావడం ఎవరన్నా చూస్తే? మంగపతి చూస్తే వెంటనే కథలల్లి ప్రచారంచేస్తాడు!

నా భయానికి నవ్వుకున్నాను.

తలుపు తాళం తీసి లోపలకు వెళ్ళాను. వెనకనే వచ్చింది సావిత్రి. కూర్చోమనికూడా చెప్పలేదు. తనే ఓ కుర్చీలో కూర్చుంది. సిగరెట్టు పారవేసి, సావిత్రివైపు తిరిగి చూశాను. నల్లని గోడకు సున్నం కొట్టినట్లుంది పౌడరు అద్దుకోవడం! పౌడరు వాసన సన్నగా గదిఅంతా వ్యాపించింది. ఏదో పూసల దండ మెడకు కట్టుకుంది. నావైపే చూస్తోంది.

"ఇంత పొద్దుపోయాక ఇలా వచ్చావేం?"

"ఏం? రాకూడదా?" విలాసంగా కళ్ళు తిప్పుతూ అంది.

సావిత్రిదగ్గరగా వెళ్ళాను.

నా కళ్ళల్లోకి చూసింది.

నైట్‌క్వీన్ పూల పరిమళం కిటికీలోనుండి తోసుకుని వచ్చింది. ఎంతయినా సావిత్రి స్త్రీ. నేను పురుషుణ్ణి. ఏదో కోరిక నాలో ఉప్పెనలా పొంగింది. ఆమె భుజంమీద చెయ్యి వేశాను. ఆమె అందగత్తె కాదన్న భావమే అప్పుడు నాకు కలగలేదు.

"మంచివారు కదూ? తీసెయ్యండి!" అంటూ మృదువుగా నా చేతిని తొలగించింది.

నాకు కోపం వచ్చింది.

"మరెందుకు వచ్చా విప్పుడు?" హేళనగా, వ్యంగ్యంగా అన్నాను.

"డబ్బు కావాలండి."

"డబ్బు ఇక్కడ కుప్పలు పోసి లేదు!" కసిగా అన్నాను.

"మీ రెంతో మంచివారు. . . కాదనరనే ఆశతో వచ్చాను. . . మీ రందరిలాంటివారు కాదండి . . ."

"నువ్వూ మంచిదానివే. . . నా మాట కాదనవు..." ఆమె చుట్టూ చేతులు వేస్తూ అన్నాను.

విసురుగా కుర్చీలోనుండి లేచింది. బలాన్నంతా ఉపయోగించి తన నడుమును చుట్టి ఉన్న నా చేతులను తొలగించింది.

పొంగుతున్న పాలలో నీళ్ళు చల్లినట్లయింది నా పని.

"ఏం? అనాఘ్రాత పుష్పంలా ఏమిటా పోజులు?" వెక్కిరింపుగా అన్నాను.

"పోజేమిటి? నేను అనాఘ్రాత కుసుమాన్ని!" రోషంగా, అభిమానంగా అంది.

ఆమె కళ్ళలో అప్పటికే నీళ్ళు తిరుగుతున్నాయి. కానీ, ఆ క్షణానికి నేనేమీ కరిగిపోలేదు.

"ఆహా! నీ సంగతి ఎవరికి తెలీదు! ఒట్టి బజారు సరుకు!" అసహ్యంగా ఆమెవైపు చూస్తూ అన్నాను.

"నేను బజారుసరుకునా! నిజంగా అంటున్నారా? మీరెంతో మంచివారనుకున్నానే! మీరూ అందరిలాగే మాట్లాడుతున్నారా?" అంటూ కుర్చీలో కూలబడి, దోసిట్లో ముఖం దాచుకుంది.

మరి కాసేపటికి వెక్కిళ్ళ శబ్దం వినిపించింది. నా మనసు కుతకుత ఉడికిపోసాగింది. విసురుగా కిటికీదగ్గరికి వెళ్ళి చీకట్లోకి చూస్తూ నిలుచున్నాను.

ఎంత నటన! సావిత్రికి నటనలో అగ్రతాంబూలం ఇవ్వవచ్చు!

రెండుమూడు నిమిషా లయ్యాక వెక్కిళ్ళశబ్దం వినిపించలేదు. వెనక్కి తిరిగి చూస్తే సావిత్రి లేదు!

• • •

ఆ మరునాడు ఉదయం ఎనిమిది గంటలప్రాంతంలో కాఫీ తాగుతున్నాను హోటల్లో. మా హెడ్‌క్లర్కు వచ్చి నా ఎదురుగా కూర్చున్నాడు. ఇద్దరికీ కాఫీకి ఆర్డర్ వేశాను.

"నీతో ఒక విషయం చెప్పాలని చాలా రోజులుగా

అనుకుంటున్నాను, బాబూ! సావిత్రి తరుచు నీ దగ్గరికి వస్తూండడం, నీతో చనువుగా మాట్లాడడం గమనించాను."

నాకు నవ్వు వచ్చింది. దగ్గరికి తీసుకొస్తున్నది ఉపాధ్యాయుడు కాకపోయినా పెద్దగా నవ్వాను బలవంతంగా.

కాఫీ వచ్చింది.

"తీసుకోండి!"

కాఫీ తాగి, కళ్ళద్దాలు తీసి కళ్ళు తుడుచుకున్నాడు. ఆయన కళ్ళు ఎందుకు చెమ్మగిల్లాయో నా కర్థం కాలేదు.

"సావిత్రివాళ్ళు ఒకప్పుడు బాగా బ్రతికినవాళ్ళు. బ్రతికి చెడినవాళ్ళు. వాళ్ళకు, మాకు దూరపు బంధుత్వం ఉంది. సావిత్రి తండ్రి వ్యాపారం చేసేవాడు. డబ్బుంటే చదువెందుకన్న మనస్తత్వం గంది సావిత్రి తల్లి. అందుకే సావిత్రికి పెద్ద చదువులు అబ్బలేదు. సావిత్రికి మేనరికం ఉండేది. చిన్నప్పటినుండి ఆ అబ్బాయి కివ్వాలని అనుకునేవాళ్ళు. అతనంటే ఆమెకు వల్లమాలిన అపేక్ష. ఇక్కడ ఇంజనీరింగ్ అయ్యాక అమెరికా వెళ్ళాడు పై చదువులకోసం. అయిదు సంవత్సరాలయినా తిరిగి రాలేదు. అక్కడే ఒక అమ్మాయిని చేసుకుని స్థిరపడిపోయినట్లు వ్రాశాడు. అది వాళ్ళ నాన్నకు, నాకుమటుకే తెలుసు. ఆ విషయం తెలిస్తే సావిత్రి గుండె పగిలి చస్తుందని, ఇండియాకు తిరిగి వస్తుండగా విమానం కూలిపోవడంవల్ల చనిపోయాడని చెప్పాము. అప్పుడు వికలమైంది ఆమె మనసు. అతను అమెరికాలో ఉన్నాడనీ, నన్ను తను చేసుకుంటాడని అందరికీ చెబుతుంది. అతనికి జాబులు వ్రాస్తుంది. తరవాత కొద్ది నెలలకే వ్యాపారం నిమిత్తం వెళ్ళిన వాళ్ళ నాన్న రైలుప్రమాదంలో మరణించాడు. ఆమె మనసు మరీ చెదిరిపోతుందని ఆ విషయం ఆమెకి తెలియజేయలేదు. రహస్యంగా అంత్యక్రియలు జరిపించాము. అతను చనిపోయాక అప్పు చాలా ఉన్నట్లు తేలింది. అప్పుకు పోగా మిగిలిన ఆస్తిని తల్లి దుబారాచేసి నాశనం చేసింది. ఇద్దరు తమ్ముళ్ళు, తల్లి — వీళ్ళ పోషణభారం సావిత్రి భుజాలమీద పడింది. ఈ ఆటెండర్ పనికి రాక తప్పలేదు. ఆఫీసులో నేను ఉండబట్టి ఏదో అలా వెళ్ళుకు వస్తూంది. అవసరమైనప్పుడు డబ్బు అడగమని ఎన్నోసార్లు చెప్పాను. 'నేనే నాకా అప్పులు పడుతూంటే, ఎవర్నని అప్పులా అడిగేది, బాబాయ్!' అంటుంది. ఏం చెయ్యను? అవసరానికి అందరిదగ్గరికి వెళ్ళి యాచిస్తుంది." ఆయన చెప్పడం ఆపారు. కళ్ళల్లో కన్నీటి తెర ఏర్పడింది. నా గుండెలు పిండినట్లయింది.

ఆయన గద్గద స్వరంతో ఇలా అన్నాడు:

"నలుగురు నాలుగు రకాలుగా చెప్పుకుంటారు. చెడిపోయిన దానని అనుకోగాకూడా విన్నాను. కానీ, సావిత్రి నిప్పులాంటి మనిషని నాకు తెలుసు. కానీ, లోకాన్నెలా నమ్మించేది? ఆమె ప్రవర్తన ఆ ప్రచారాలకు దోహదకారిగా ఉంది. పెళ్ళిచేస్తే దారికి వస్తుందేమోనని రెండుమూడు పెళ్ళిప్రయత్నాలుకూడా చేశాను. వద్దన్నది. బావ వచ్చి చేసుకుంటాడని కలలు కంటుంది, పిచ్చిది! భయంకరమైన ఆ నిజాన్ని ఎంత త్వరగా వెల్లడిచేస్తే అంత మంచిదనిపిస్తుంది. ఇంతకూ ఈ కథనం అంతా ఎందుకంటే, తీరం, అందరిలా అపార్థం చేసుకోక, అర్థం చేసుకునేందుకు ప్రయత్నించు, బాబూ! ఈ మనుషుల ప్రచారాలూ, వెక్కిరింపులూ—వీటితో ఆమె మనసు రోజురోజుకూ శిథిలమైపోతూంది. ప్చ్! ఈ లోకంలో ఎలా బ్రతుకుతుందో పిల్ల? ఇప్పుడు నాల్గింటికే వెళుతున్నాను. పిల్లవాడికేమో బాగా లేదు."

నా తల గిర్రున తిరిగిపోయింది. నా అమానుషత్వం వేయితలలతో నాముందు నిలిచి వెక్కిరించసాగింది. నేనొక మనిషినేనా? మనుషు లింత క్రూరంగా ప్రవర్తిస్తారా?

సాయంత్రంవరకూ ఆఫీసులో ఎలా ఉన్నానో నాకే తెలీదు. సాయంత్రానికల్లా విపరీతమైన తలపోటు ప్రారంభమైంది. ఆఫీసు వదిలి వస్తూంటే వ్యాను రామయ్య తక్కినవాళ్ళతో చెబుతున్నాడు:

"ఆ సావిత్రమ్మకు పిచ్చి ఎక్కువైంది, సార్. మధ్యాహ్నం ఆమె తమ్ముడు చనిపోయాడు. సరిఅయిన వైద్యం లేకనేనట. పిచ్చి మరీ ముదిరిపోయింది, సార్! 'నేను బజారుసరుకునుగాను, బజారుసరుకునుగాను. మీరూ అలాగే అంటారా?' అంటూ ఒకే కేకలు. ఆ కేక కర్థం ఏమిటో మరి?"

నా కాళ్ళక్రింద భూమి కదులుతున్నట్లయింది. మనసు మనసులో లేదు. ఆలోచనలు మెదడును మథించివేస్తున్నాయి. ఈ జీవితం మహాసంగ్రామంలాంటిది. ఆశలతో, ఆశయాలతో, కలలతో, కోరికలతో పోరాడి ఓడిపోయిన పరాజితులు చుట్టూ ఎందరో ఉన్నారు. అటువంటివారిని చూసి జాలిపడి, చేతనైన సాయం చేయడం మానవత్వంకానీ, రాళ్ళు రువ్వి తరమడం మానవతకు నిదర్శనం కాదు. ఈ నిర్భాగ్యులమీదికి ఎందు కిలా గెలిచేయడం? గాయాలతో నిండియున్న వారి హృదయాలను తిరిగి రక్తసిక్తం చేయడం ఎంతటి అన్యాయం? నేను అన్యాయుడ్ని. సావిత్రి శాపగ్రస్తురాల్ని అపార్థాలతో నింపాను. ఆమె చేసిన తప్పేమిటి? అందంగా లేకపోవడం, ఆమె తప్పా? ముప్ఫయి దాటినా పెళ్ళికాకపోవడం ఆమె చేసిన నేరమా? పెళ్ళి చేసుకోవాలని ఆశించడం క్షమార్హం కాదా? రాత్రి డబ్బు ఇచ్చుంటే సావిత్రి తమ్ముడు బ్రతికి ఉండేవాడేమో? ఎంత పని చేశావు, సావిత్రి! నిజం ఎందుకు చెప్పకూడదు? నీ వాస్తవ స్థితిని నాకు కనిపించనీక ఎందుకు తెరలు కట్టావు? ఇప్పు డేమైంది? అందరికన్నా మంచివాడనని నాకు దగ్గరిగా వచ్చావు.



''విడిగి విప్పారి...'' ఫోటో—కె. సరోజిని (చిత్తరంజన్)

కానీ, నేను చేసిందేమిటి? ముక్కలైన నీ మనసును ఛిన్నాభిన్నం చేశాను. అది 'వలలో వేసుకోవడంలో' ఒక భాగంలా భావించాను! నీ భావ్యా ప్రవర్తన అనే రంగులతో నీ శీలచిత్రణ చేశాను! ఎంత అవివేకం! ఎంత అజ్ఞానం! ఎంత అమానుషత్వం! భగవాన్! ఈ పాపానికి నిష్కృతి అంటూ ఏమన్నా ఉందా? సావిత్రీ! నన్ను క్షమించవూ? ముందువెనకలు విచారించక ఈ మూర్ఖుల మాటలు గుడ్డిగా నమ్మాను. విరిగిపోయిన, ఛిన్నాభిన్నమైన నీ మనసును అతికిస్తాను, సావిత్రీ! భగవాన్! ఈ ఒక్క పనిని ఈ జీవితంలో చేయనీ.

మూగగా ప్రార్థించాను మనసులోనే భగవంతుణ్ని.

పిచ్చిపట్టినవాడిలా సావిత్రి ఇంటివైపు పరుగుతీశాను. ★